గరిష్టం/కనిష్టం
28.0 /16.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేడు ఒడ్డె ఓబన్న జయంతి

మంచిర్యాలటౌన్: నస్పూరులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 11న ఉదయం 10:30గంటలకు ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు ప్రజలు, సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

12న వివేకానంద జయంతి

మంచిర్యాలటౌన్: నస్పూరులోని కలెక్టరేట్‌లో ఈ నెల 12న ఉదయం 10:30గంటలకు స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ కార్గోలో పిండివంటల హోమ్‌డెలివరీ

మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని టీజీఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా హైదరాబాద్, సికింద్రాబాద్, వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు పిండివంటలు చేర్చేలా హోండెలివరీ సౌకర్యం కల్పించినట్లు ఆదిలాబాద్, నిజామాబాద్ కార్గో మేనేజర్ బి.పాల్ తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలో కార్గో సర్వీసు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంటనగరాల్లో 240 ఏరియాలకు పిండివంటలు, స్వీట్లు, బహుమతులు పంపించే సౌకర్యం ఉందన్నారు. జిల్లాలోని అన్ని కార్గో కేంద్రాల్లో హోమ్ డెలివరీ బుకింగ్ సౌకర్యం ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల ఇంచార్జి అశోక్‌రావు, ఆదిలాబాద్ సేల్స్ టీం సభ్యులు సాయన్న, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక


విద్యాసాగర్

తాండూర్: జాతీయ విద్యావిధానం 2020పై జాతీయ స్థాయిలో శిక్షణ కార్యక్రమానికి మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఐలాపు విద్యాసాగర్ ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 28వరకు ఢిల్లీలో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయనను ఎంఈవో మల్లేశం, ఉపాధ్యాయులు అభినందించారు.

టీఎన్జీవోస్ గృహ నిర్మాణ కమిటీ ఎన్నిక


గృహ నిర్మాణ కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ జిల్లా కమిటీని శుక్రవారం టీఎన్జీవోస్ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఎం.శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను ప్రకటించారు. అధ్యక్షుడిగా గడియారం శ్రీహరి, కార్యదర్శిగా మహ్మద్ హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా ఎస్.మొండయ్య, సంయుక్త కార్యదర్శిగా భూముల రామ్మోహన్, కోశాధికారిగా డి.రాజమౌళి, కార్యవర్గసభ్యులుగా నాగుల గోపాల్, బి.కళావతి, ఏపీఆర్‌డీ ప్రసాదరావు, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, న్యాయ సలహాదారులుగా పుప్పాల హన్మంతరావు, సంతోష్, ఎస్.రమేశ్, పి.తిరుపతిరెడ్డి, సలహాదారులుగా శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, ఎల్.గోవింద్‌రెడ్డి, బి.లలిత, ఏ.సునిత, సీహెచ్.మధుసూదన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టులు నిర్మించాలి


మాట్లాడుతున్న గోవర్ధన్

పాతమంచిర్యాల: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత, కుప్టి ప్రాజెక్టులు నిర్మించాలని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని తెలంగాణ జల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లిలో జరిగిన సమావేశంలో కుంటాల జలపాతం ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటించారని అన్నారు. ఈ సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు టి.శ్రీనివాస్, లాల్‌కుమార్, ఖలిందర్ అలీఖాన్, జయరావు, గోపినాథ్, దేవరాజ్, సంజీవ్ పాల్గొన్నారు.

గోవింద.. గోవిందా..!




మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు, ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

- ఆలయాల్లో 'ముక్కోటి' పూజలు
- ఉత్తర ద్వార దర్శనానికి బారులు

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి/మందమర్రిరూరల్: జిల్లాలోని ఆలయాల్లో గోవింద నామస్మరణ మారుమోగింది. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో సందడి నెలకొంది. మంచిర్యాలలో ని విశ్వనాథ ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర ఆలయంలో ముక్కోటి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉత్తర ద్వారం వద్ద గరుడ వాహనంపై వేంకటేశ్వరుని పూలమాలలతో అలంకరించారు. వేకువజాము నుంచే ఉత్తర ద్వారం గుండా వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. మాజీ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ముక్తా రవి, అర్చకులు భట్టాచార్య, నరహరిశర్మ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. పాత మంచిర్యాల రామలింగేశ్వర ఆలయంలో ఉత్తర ద్వారాన్ని ప్రారంభించగా.. భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, మాజీ చైర్మన్ పెంట రాజ య్య, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, కౌన్సిలర్ బోలిశెట్టి సునిత, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు. దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం గుండా భక్తులు సత్యదేవుణ్ని దర్శించుకుని పూజలు చేశారు. మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయం, పంచముఖి హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ కుమార్‌దీపక్ దంపతులు, ఆర్డీవో శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. రామగుండం సీపీ శ్రీనివాస్, జిల్లా డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమమార్ ఉత్తరం ద్వారం నుంచి స్వామి దర్శనం చేసుకున్నారు.


మందమర్రిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులు


దర్శనం చేసుకుంటున్న రామగుండం సీపీ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్


మంచిర్యాలలో బారులు తీరిన భక్తులు

బీపీ, షుగర్ పెరిగిపోతోంది..!

- జిల్లాలో ఎన్‌సీడీ సర్వే
- బయటపడుతున్న రక్తపోటు, మధుమేహం
- వ్యాయామంతోనే రక్షణ అంటున్న వైద్యులు



మంచిర్యాలలో ఎన్‌సీడీ సర్వేలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మంచిర్యాలటౌన్: మారుతున్న జీవనశైలి, తినే ఆహారంతో జిల్లాలో బీపీ(రక్తపోటు), షుగర్(మధుమేహం) బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) సర్వేలో బీపీ, షుగర్ బారిన పడిన వారి సంఖ్య బయటపడుతోంది. ఎక్కువ మంది రక్తపోటు బారిన పడుతుండగా.. అందుకు తగ్గట్లుగానే షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడం కనిపిస్తోంది. ఉరుకులు, పరుగుల జీవితంలో చాలామంది సమయానికి సరైన ఆహారం తీసుకోకపోవడం, మానసిక ఒత్తిడికి గురి కావడం, సరైన నిద్ర, తగిన విశ్రాంతి లేకపోవడం, వ్యాయామం చేసేందుకు తగిన సమయం కేటాయించకపోవడం తదితర కారణాలు వ్యాధుల బారిన పడడానికి కారణం అవుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు 50ఏళ్లు దాటిన వారిలో మాత్రమే బీపీ, షుగర్ వ్యాధి కనిపించేవి. ప్రస్తుతం చిన్న వయస్సులోనే మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా ఆయా వ్యాధుల బారిన పడుతున్నట్లుగా సర్వేలో గుర్తిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. ఒక్కసారి ఈ వ్యాధులు దరిచేరితే వాటిని అదుపులో ఉంచేందుకు జీవితాంతం మందులు వాడడంతోపాటు సరైన వ్యాయామం, ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.


బయటపడుతున్న వ్యాధులు

వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే చేపట్టారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నారు. అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇలా అన్నింటిలోనూ జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 8,09,000 మంది జనాభా ఉండగా.. 30ఏళ్లు పైబడిన వారిలో 4,16,279మంది ఉన్నట్లు గుర్తించారు. 27,376మందికి మధుమేహానికి సంబంధించిన పరీక్షలు చేయగా.. 25,399మంది వ్యాధిబారిన పడినట్లు గుర్తించారు. వారికి వైద్యంతోపాటు మందులు అందిస్తున్నారు. 66,543మందికి రక్తపోటు పరీక్షలు చేయగా.. 64,291మందికి బీపీ ఉన్నట్లు నిర్ధారించి చికిత్సలో భాగంగా అవసరమైన మందులు అందజేస్తున్నారు. వీటితోపాటు క్యాన్సర్ బారిన పడిన అనుమానితులను హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. 59మంది క్యాన్సర్ బారిన పడినట్లు గుర్తించగా.. ఓరల్ క్యాన్సర్ కేసులు 16, బ్రెస్ట్‌క్యాన్సర్ కేసులు 34, సర్వైకల్ క్యాన్సర్ కేసులు 9 కేసులు ఉన్నట్లుగా నిర్ధారించారు. జిల్లాలో ఇంకా సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే వేలాది మందిలో బీపీ, షుగర్ ఉన్నట్లు గుర్తించి వారి వివరాలను వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసి ఎన్‌సీడీ కార్డు ఇస్తున్నారు. ఈ కార్డులో పేషెంటు పేరు, అందిస్తున్న చికిత్స, మందుల వివరాలు పొందుపరుస్తున్నారు. ప్రతీ నెల సరిపడా మందులు ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా అందిస్తారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా, మందులను వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సిద్ధం చేసి బాధితులకు అందిస్తున్నారు.

జిల్లాలో సర్వే వివరాలు



సరైన వైద్యం పొందాలి



ప్రస్తుతం ప్రజల జీవనశైలితో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతుండగా, ఎన్‌సీడీ సర్వే ద్వారా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నాం. వారికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందించడంతోపాటు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాం. బీపీ, షుగర్ బారిన పడ్డ వారిలో ఇతరత్రా అవయవాలపై ప్రభావం చూపేందుకు అవకాశం ఉండడంతో సరైన వైద్యం పొంది, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. వ్యాధులను అదుపులో ఉంచుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ హరీశ్‌రాజ్,
జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

సైన్స్ టెక్నో ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడి ఎంపిక


ప్రవీణ్

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 11, 12న మధ్యప్రదేశ్ రాష్ట్రం బరహాన్పూర్‌లోని మాక్రో విషనరి అకాడమిలో సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ క్విజ్, టీఎల్‌ఎం, రోల్ ప్లే అండ్ సైన్స్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ప్రదర్శిస్తారు. దేశ నలుమూలల నుంచి ఎంపికైన విద్యార్థులు తమ గైడ్ టీచర్ సహాయంతో ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. ఇందులో ప్రవీణ్ సైన్స్ టీ ఎల్‌ఎంను ప్రదర్శిస్తారు. ఇప్పటికే ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యాడు. ఈ రెండు కార్యక్రమాలకు ఎంపికైన ప్రవీణ్‌ను డీఈవో యాదయ్య, ప్రిన్సి పాల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన అన్వేష్


నేస అన్వేష్

కోటపల్లి: ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ ఉన్న రోజులివి. ఒక ఉద్యోగం సాధించాలంటే ఎంతో కష్టపడాలి. అలాంటిది కోటపల్లి మండల కేంద్రానికి చెందిన నేస అన్వేష్ ఒకటి.. రెండు కాదు నాలుగేళ్లలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు సాధించి ఔరా అనిపిస్తున్నాడు. 2020లో మొదటగా ఫైర్‌కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. చెన్నూర్‌లో విధులు నిర్వర్తిస్తూనే ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–4 ఫలితాల్లోనూ సత్తాచాటి కమర్షియల్ టాక్స్ అధికారిగా ఉద్యోగం సాధించాడు. తాజాగా ప్రకటించిన టౌన్ ప్లానింగ్ అధికారి పరీక్ష ఫలితాల్లోనూ అన్వేష్ ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా ఉండగా టౌన్‌ప్లానింగ్ అధికారి ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపాడు. నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అతడిని పలువురు అభినందిస్తున్నారు.

అడుగులో అడుగేస్తూ..

- మెస్రం వంశీయుల పాదయాత్ర ప్రారంభం
- పవిత్ర గంగాజల సేకరణకు శ్రీకారం
- ఈ నెల 17న హస్తిన మడుగుకు చేరిక
- 28న నాగోబా జాతర

నాగోబా.. ఆదివాసీల ఆరాధ్య దైవం. ఏటా పుష్య మాస అమావాస్య పురస్కరించుకుని జాతరకు శ్రీకారం చుడుతారు. ఇప్పటికే ప్రచార రథయాత్ర చేపట్టిన మెస్రం వంశీయులు శుక్రవారం ప్రధాన ఘట్టమైన గంగాజల సేకరణ పాదయాత్ర షురూ చేశారు. కేస్లాపూర్ నుంచి హస్తిన మడుగు బాట పట్టారు. తెల్లని వస్త్రాలు ధరించి ఆచార సంప్రదాయాలు పాటిస్తూ అడుగులో అడుగేస్తూ ముందుకు సాగారు. – ఇంద్రవెల్లి


గంగాజలం కోసం వెళ్తున్న మెస్రం వంశీయులు

నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయులు కేస్లాపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఏడు రోజుల పాటు వంశీయులు ఉన్న ప్రాంతాల్లో ప్రచార రథయాత్ర చేపట్టిన వీరు శుక్రవారం తిరిగి కేస్లాపూర్‌కు చేరుకున్నారు. మురాడి వద్ద సమావేశమై గంగాజల పాదయాత్ర, మహాపూజ నిర్వహణపై చర్చించారు. ఝరి(కలశ) దేవతకు పూజలు చేశారు. మెస్రం అల్లుళ్లు, ఆడపడుచులు బుందో పట్టగా.. వంశపెద్దలు కానుకలు వేశారు. అనంతరం 130 మందితో గంగాజల సేకరణ పాదయాత్ర ప్రారంభించారు. తొలిరోజు మండలంలోని బట్టగూడ గ్రామంలో బస చేశారు. ఈ నెల 11న మండలంలోని వడగామ్, 12న ఉట్నూర్ మండలంలోని సాలేవాడ, 13న ధర్మగూడ, 14న కొత్తగూడ, 15న కడెం మండలంలోని ఉడుంపూర్, 16న దస్తూరాబాద్ మండలంలోని మల్లాపూర్ గ్రామాల్లో బస చేయనున్నారు. ఈ నెల 17న మంచిర్యాల జిల్లా జన్నారం మండలం గోదావరి హస్తిన మడుగుకు చేరుకుని ప్రత్యేక పూజల మధ్య పవిత్ర గంగాజలం సేకరించనున్నారు. అదేరోజు తిరుగు పయనమవుతారు. 18న ఉట్నూర్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు. 19న ఉట్నూర్ మండలంలోని సర్సాపూర్, 20న ఇంద్రవెల్లి మండలంలోని దొడందకు చేరుకుంటారు. అక్కడి పొలిమేరలో తీసుకొచ్చిన పవిత్ర గంగాజలాన్ని భద్రపరిచి తమ గ్రామాలకు వెళ్తారు. తిరిగి ఈ నెల 24న అక్కడి నుంచి ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కేస్లాపూర్ సమీపంలోని మర్రి చెట్టు(వడమర) వద్దకు చేరుకుని అక్కడే బస చేస్తారు. 25 నుంచి మూడు రోజుల పాటు సంప్రదాయ, తూమ్(కర్మఖాండ)పూజలు నిర్వహిస్తారు. పుష్యమాస అమావాస్య పురస్కరించుకొని 28న రాత్రి 10:30 గంటల సమయంలో తీసుకువచ్చిన పవిత్ర గంగాజలంలో నాగోబాను అభిషేకించి జాతర ప్రారంభించనున్నట్లు వంశ పెద్దలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెస్రం పెద్దలు చిన్ను, బాదిరావ్, కోసేరావ్, ఆనంద్‌రావ్, ప్రధాన్ పెద్దలు దాదారావ్, వంశ ఉద్యోగులు సోనేరావ్, శేఖర్‌బాబు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెళ్లాలి.. విద్యార్థులు వద్దు

గంగాజల సేకరణ యాత్రలో పాల్గొన్న వారు నియమ నిష్టలతో, భక్తి శ్రద్ధలతో ఉండాలని, ఈ సారి విద్యార్థులను పంపొద్దని, సెల్‌ఫోన్లు తీసుకెళ్ల కూడదని మురాడి వద్ద సమావేశమైన మెస్రం వంశీయులు తీర్మానించారు. పాదయాత్రలో పాల్గొనే వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. మార్గమధ్యలో బస చేసిన గ్రామాల నుంచి బంధువుల ఇళ్లకు, ఇతర ప్రాంతలకు వెళ్లొద్దని సూచించారు. ఈ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.

మాతాశిశు మరణాలు నియంత్రిస్తాం


కరదీపికలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లాలో మాతాశిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధి కారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. శుక్రవారం న స్పూరులోని కలెక్టరేట్‌లో అర్మాన్ సంస్థ ఆరో గ్య కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు తమ వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదు చేయించుకుని సమయానుసారంగా వైద్య పరీక్షలు చే యించుకునేలా చూడాలని అన్నారు. అవసరమైన మందులు, పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని, తల్లులను శక్తివంతం చేసేందుకు ఆరోగ్యవంతమైన పిల్లల ఎదుగుదలకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపా రు. యూనిసెఫ్, అర్మాన్ సంస్థకు చెందిన డా క్టర్ సౌజన్య, డాక్టర్ అనిల్, ప్రశాంత్‌కుమార్, భాస్కర్ శిక్షణ ఇవ్వగా, వైద్య ఆరోగ్య శాఖ, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా శిక్షణ కరదీపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కృపాబాయి, ప్రోగ్రాం అధికారులు ఎస్.అనిత, సీతారామరాజు, ప్రసాద్, అనిల్, మాస్ మీడి యా అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటిబాట

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో వసతిగృహాల్లోని విద్యార్థులు ఇంటిబాట పట్టారు. శుక్రవారం ఆయా వసతిగృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో సెలవుల్లో ఏం చేయాలనే విషయాలపై పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి తల్లిదండ్రులు పిల్లల కోసం విద్యాసంస్థలకు చేరుకున్నారు. దీంతో కేజీబీవీతోపాటు రెసిడెన్షియల్, వసతిగృహాల వద్ద కోలాహలంగా మారింది. సెలవుల వేళ వస్తువులు, పుస్తకాలు అన్నింటిని వెంట తీసుకుని కుటుంబ సభ్యులతో వెళ్లారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు న్యాయమైన హక్కులు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయాలని, బీసీ ఫెడరేషన్‌లకు పాలక మండళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. లక్ష కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, బీసీ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, గౌరవ అధ్యక్షుడు కర్రె లచ్చన్న, నాయకులు డాక్టర్ రఘునందన్, శ్రీపతి రాములు, బీంసేన్, రాజేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు పత్రం ఇస్తున్న సూర్యారావు

పాతమంచిర్యాల: బీసీ సమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా మంచిర్యాలకు చెందిన నరెడ్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీలను ఏక తాటిపైకి తెప్పించడానికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కాసిపేట: గంజాయి అక్రమ రవాణా, విక్రయం కేసులో పోలీసులను ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఇందుకు సంబంధించిన వివరాలు పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. శుక్రవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్వరి చర్చి ఎదురుగా ఉన్న టేకుచెట్లలో మందమర్రికి చెందిన శహని సందీప్, ఉన్ని పవన్ బల్లార్ష నుంచి తెచ్చిన గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.3,500 విలువైన 140 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాత కక్షలతో ఇరువర్గాల ఘర్షణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి టూటౌన్ పరిధిలో ఇరువర్గాలవారు శుక్రవారం పరస్పరం దాడి చేసుకున్నారు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే రడగంబాల బస్తీకి చెందిన ఫర్జానా, ముజ్జు, అన్వర్, ముక్తార్, సుభాష్‌నగర్ బస్తీకి చెందిన సలీం, జమీల్, సల్మాన్ కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఘర్షణ పడినట్లు ఎస్సై తెలిపారు. ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురికి మూడేళ్ల జైలు

భైంసాటౌన్: దాడి కేసులో ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ భైంసా ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి డీ దేవేంద్రబాబు తీర్పు ఇచ్చినట్లు కోర్టు డ్యూటీ అధికారి పాండునాయక్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. 2018 ఏప్రిల్ 1న మహారాష్ట్రకు చెందిన కందారే మాధవ్, నితిన్, దూసేవాడ్ చరణ్ తానూరు మండలం బెల్‌తరోడలోని మనోజ్ అనే వ్యక్తి స్వీట్‌హోంకు వచ్చి స్వీట్లు తిన్నారు. అనంతరం బిల్లు చెల్లించే క్రమంలో స్వీట్ హోం యజమానితో గొడవపడి కడాయిలో ఉన్న నూనెను మనోజ్‌తోపాటు అక్కడే పనిచేసే జగదీశ్‌పై పోయడంతో వారు తీవ్రగాయాల పాలయ్యారు. దీంతో అప్పటి తానూరు ఎస్సై రాజన్న కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించగా, శుక్రవారం కోర్టులో కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో నిందితులు మాధవ్, నితిన్, చరణ్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఆదివాసీల ఆశాజ్యోతి

- గిరిజనుల అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన హైమన్‌డార్ఫ్
- మార్లవాయి కేంద్రంగా సేవలు
- జ్ఞాపకార్థం విగ్రహాల ఏర్పాటు
- నేడు ప్రొఫెసర్ డార్ఫ్ వర్ధంతి



మార్లవాయిలో డార్ఫ్ దంపతుల విగ్రహాలు

జైనూర్: ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంపతులు. వారి అభివృద్ధికి వీరి చేసిన కృషి ఎనలేనిది. డార్ఫ్ చొరవతోనే 1.60 లక్షల ఎకరాల పోడు భూములకు సంబంధించి ఆదివాసీలకు అటవీహక్కులు వచ్చాయి. గిరిజన ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. 30 ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పారు. తిర్యాణి మండలంలోని గిన్నెధరి, వరంగల్‌లోని తాడ్వాయి, సుదిమైళ్లలోనూ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలు ప్రారంభించారు. గిరిజనులకు శిక్షణ ఇప్పించి గిరిజన ప్రాంతాల్లో వారినే ఉపాధ్యాయులుగా నియమించారు. వృత్తి శిక్షణ కేంద్రాలు స్థాపించారు. గిరిజనులు నివసించే ప్రదేశాల ను 1945లో నోటిఫైడ్ షెడ్యూల్డ్ ఏరియాలుగా ప్రకటించారు. ఇక్కడి భూబదలాయింపులపై నిషేధం విధించారు. నాగోబా జాతర తర్వాత గిరిదర్బార్‌ను ఏర్పాటు చేసి వారి భాషలోనే ఫిర్యాదులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. మారుమూల ఆదివాసీ గ్రామానికి ఇలా ఎన్నో సేవలందించారు. ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్-బెట్టి ఎలిజబెత్ దంపతుల రాకతో చరిత్ర పుటల్లో మార్లవాయికు ప్రత్యేక స్థానం దక్కింది.

ఆత్మబంధువుగా నిలిచి..

కెరమెరి మండలం జోడేఘాట్ పోరాట యోధుడు కుమురంభీం నిజాం సైన్యం చేతిలో 1940లో అమరుడయ్యారు. వీరుడి మరణానంతరం గిరిజనుల్లో అశాంతి చెలరేగింది. ఈ పరిస్థితికి కారణాలు గిరి తెగల్లో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నిజాం ప్రభుత్వం హైమన్‌డార్ఫ్‌ను 1945లో ఆదిలాబాద్‌కు పంపింది. ఆయన మార్లవాయిలో నివాసం ఏర్పాటు చేసుకుని గిరిజనులతో మమేకమయ్యారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో 1957 వరకు పర్యటించారు. 1948లో నిజాం ప్రభుత్వం పడిపోయిన అనంతరం కూడా ఆయన ఏటా మార్లవాయికి రావడంతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసులను కలుసుకునేవారు. మార్లవాయి గ్రామానికి చెందిన కనక రాజుబాయి హైమన్‌డార్ఫ్-బెట్టి ఎలిజబెత్ దంపతులకు అండగా నిలిచారు. 1995 జనవరి 11న మృతి చెందగా చివరి క్షణాల్లో ఉన్న డార్ఫ్ తన అస్థికలను మార్లవాయికు తీసుకెళ్లాలని అక్కడి గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని కోరగా కుమారుడు ఆచరించాడు. బెట్టి ఎలిజబెత్ 1987లో కన్నుమూయగా ఆమెనూ మార్లవాయిలోనే సమాధి చేశారు. అప్పటి నుంచి హైమన్‌డార్ఫ్-ఎలిజబెత్ దంపతుల వర్ధంతి ఒకే రోజు నిర్వహిస్తున్నారు. ఆయన ఆశయం మేరకే కుమారుడికి లచ్చుపటేల్‌గా నామకరణం చేశారు.

సేవల్లో మెప్పించి.. ఉత్తమంగా నిలిచి

ఇప్పటికే గుస్సాడీ నృత్యానికి పేరు గాంచి అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీతో జాతీయ స్థాయిలో ప్రత్యేక స్థానాన్ని సాధించుకుంది మార్లవాయి. ఈ పంచాయతీ పౌరులకు ఉత్తమ సేవలందించినందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పురస్కారం అందించింది. ప్రజలకు అన్ని విధాలా మౌలిక వసతులు కల్పిస్తూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేస్తుండటంతో దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ కింద ఈ చరిత్రాత్మక గ్రామం ఎంపికైంది. ఈ మేరకు అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా మాజీ సర్పంచ్ కనక ప్రతిభ అవార్డు అందుకున్నారు. గ్రామంలో అంతర్గత సీసీ రహదారులు లేక గ్రామస్తులు నిత్యం అవస్థలు పడేవారు. వీరి కష్టాలను దూరం చేయాలనే ఉద్దేశంతో అప్పటి పంచాయతీరాజ్ శాఖ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ హన్మంత్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.20 లక్షల నిధులతో మార్లవాయి గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టారు.

పోలీస్ కేసు లేని గ్రామంగా..

దశాబ్దాలుగా పోలీసు కేసు లేని గ్రామంగా మార్లవాయి నిలిచింది. ఏ ఊరిలోనైనా గొడవలు ఉంటాయి. పోలీసు కేసులుంటాయి. కానీ.. ఈ గ్రామ సమీపంలోనే పోలీస్‌స్టేషన్ ఉన్నా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. దీనికి కారణం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన రాయిసెంటర్ వ్యవస్థే కారణం. మార్లవాయిలో సుమారు 103 కుటుంబాలుండగా 700కు పైగా జనాభా నివసిస్తున్నారు. ఆ గ్రామంలో గొడవలు జరిగితే పరిష్కరించేందుకు ఓ పటిష్ట వ్యవస్థ ఉండాలని 1945లోనే మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ రాయిసెంటర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఎంత పెద్ద గొడవ జరిగినా, ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా రాయిసెంటర్‌లోనే పరిష్కారమయ్యేలా చూస్తున్నారు.



మార్లవాయిలో డార్ఫ్ దంపతుల సమాధులు



మార్లవాయిలో నిర్మించిన గుస్సాడీ శిక్షణ కేంద్రం

ఆదివాసీల సమస్యల పరిష్కారానికి చర్యలు



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ పెద్దలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఆదివాసీ పెద్దలతో సమావేశం

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలోని ఆదివాసీ ప్రాంతాలు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల ప్రతినిధులు సీఎంకు సమస్యలు విన్నవించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆదివాసీల కోసం ఇప్పటికే చేపట్టిన పలు విషయాలను ప్రస్తావిస్తూ వారు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. కుమురంభీం జయంతి, వర్ధంతిని అధికారిక ఉత్సవంగా నిర్వహించాలని ఆదేశించారు. ఐటీడీఏ ప్రాంతాలకు జనాభా ప్రాతిపదికన ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్ కింద ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేయించాలని, ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించాలని పేర్కొన్నారు. ఆదివాసీ గూడేల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని స్మృతివనంగా మార్చి, అమరుల కుటుంబాలకు ఇండ్లు మంజూరుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఆదివాసీ రాయి సెంటర్లకు భవనాలు నిర్మించేందుకు అధ్యయనం చేసి నివేదిక అందించాలని, కేస్లాపూర్ జాతరకు నిధుల మంజూరుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యమాల్లో ఆదివాసీలపై పెట్టిన కేసులు తొలగించాలని, ఆదివాసీల మాతృభాషలో విద్యను బోధించాలని, గోండు భాషలో ప్రాథమిక విద్యను బోధించే అంశంపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని పేర్కొన్నారు. ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెంటనే మంజూరు చేస్తున్నామని తెలిపారు. విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని, ఇప్పటికే మంజూరైన బీఈడీ కళాశాలకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రి సీతక్క, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతోపాటు ఆదివాసీ సంఘాల నేతలు మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, గోడం నగేశ్, మెస్రం మనోహర్, మర్సుకోల తిరుపతి, టేకం భాస్కర్, జుగ్నక దేవ్‌షా ర్మేడి, కొడప హన్మకుపటేల్, అమృత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

రామకృష్ణాపూర్: ఖేలో ఇండియా పోటీల్లో భాగంగా పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో తెలంగాణ అండర్-13 బాలికల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్, స్పోర్ట్స్ స్కూల్ హకీమ్‌పేట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగగా 2-1 గోల్స్ తేడాతో స్పోర్ట్స్ స్కూల్ జట్టు విజయం సాధించింది. అలాగే కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్, ట్విన్‌సిటీస్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌లో 4-0 గోల్స్‌తో కేర్ ఫుట్‌బాల్ అకాడమీ గెలుపొందింది. మరో లీగ్ మ్యాచ్ ఉమెన్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్, గజ్వేల్ జట్ల మధ్య జరుగగా 10-0 గోల్స్ తేడాతో ఉమెన్ ఫుట్‌బాల్ క్లబ్ విజయం సాధించింది. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ గద్దెరాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, ఏఈ అచ్యుత్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పల్లేరాజు తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు.

జల్సాల కోసం చోరీలు

- ఇద్దరు నిందితుల అరెస్ట్

సోన్: వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు దొంగిలించిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ రాజేశ్‌మీనా శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. నిర్మల్ రూరల్ మండలం ఎల్లపెల్లి గ్రామానికి చెందిన దండుగుల రవి, శివరాత్రి రవి జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. గత నవంబర్‌లో కొండాపూర్ గ్రామంలో ఓ ఇంటిముందు ఉన్న రొటోవేటర్‌ను దొంగిలించారు. వారి బంధువులైన మాదాపూర్‌కు చెందిన ప్రవీణ్, సాయితో కలిసి మాదాపూర్ శివారులో రోడ్డు పక్కనున్న మరో రొటోవేటర్‌ను అపహరించారు. వీటిని ట్రాక్టర్‌లో వేసుకుని విక్రయించేందుకు ఆర్మూర్, నిజామాబాద్‌కు వెళ్తుండగా మాదాపూర్ ఐబీ వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరిని పట్టుకున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్సై గోపిని ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ రాజేశ్‌మీనా అభినందించారు. సీఐ నవీన్‌కుమార్, నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, సోన్ ఎస్సై గోపి, మామడ ఎస్సై సందీప్, లక్ష్మణచాంద ఎస్సై సుమలత, పోలీసులు ప్రతాప్‌రెడ్డి, విజయ్, సూర్యభాను, భాస్కర్, భీమన్న, సంధ్య, కీర్తన, మనీషా తదితరులున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

కుభీర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- రూ.16 లక్షల ఆస్తినష్టం

కుభీర్: మండల కేంద్రంలోని అన్నపూర్ణ ఎంటర్‌ప్రైజెస్‌లో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నపూర్ణ ఎంటర్‌ప్రైజెస్ యజమాని గాజుల లింబాద్రి గురువారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. 10గంటలకు దుకాణం నుంచి పొగరావడం చూసి స్థానికులు అతడికి సమాచారమిచ్చారు. అతడు వచ్చి చూడగా షెట్టర్ నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే విద్యుత్ అధికారులు కరెంట్ నిలిపివేశారు. పోలీసులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఈలోపే ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫ్రిజ్‌లు, ఎల్‌ఈడీ టీవీలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఆ తరువాత అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. రెవెన్యూ అధికారులు శుక్రవారం పంచనామా నిర్వహించి రూ.16లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ధ్రువీకరించారు.



కాలిబూడిదైన షాపు

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. బాధితుడు సద్దనపు శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బడాహనుమాన్ మందిర్ సమీప కాలనీకి చెందిన శ్రీనివాస్ శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఇంట్లో పూజ చేసి దేవుని వద్ద దీపం వెలిగించాడు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి బజారుకు వెళ్లాడు. ఈక్రమంలో దేవుని వద్ద వెలిగించిన దీపం నుంచి మంటలు చెలరేగి ప్రమాదవశాత్తు పక్కనున్న బట్టలు, ఇతర సామగ్రికి కాలిపోయింది. ఇంటి నుంచి పెద్ద ఎత్తున పొగలు రాగా చుట్టు పక్కలవారు గమనించి శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చిన శ్రీనివాస్ వెంటనే ఫైరింజన్ కోసం ఫోన్ చేశాడు. ఫైర్‌సిబ్బంది వెంటనే వచ్చి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు రాంలాల్‌గిల్డా, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, మహేందర్, తగరం చిరంజీవి పరామర్శించారు. బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.3వేల నగదు, బియ్యం అందజేశారు.

అప్పు చెల్లించనందుకు దాడి

- చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

లక్సెట్టిపేట: మండలంలోని జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తపు పోచయ్య (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన శంకరయ్య వద్ద పోచయ్య రూ.30 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ నెల 7న శంకరయ్య పోచయ్య ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా పోచయ్య లేవని బదులిచ్చాడు. దీంతో ఆగ్రహించిన శంకరయ్య కర్రతో పోచయ్య తలపై బలంగా కొట్టాడు. దీంతో పోచయ్యకు తీవ్ర రక్తస్రావం కాగా స్థానికులు, కుటుంబీకులు లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి మనుమడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రామయ్య

కోతుల పునరుత్పత్తికి కొన్ని నెలల్లో చెక్!

- గ్రామస్తులు స్వచ్ఛందంగా కోతులను పునరావాస కేంద్రానికి తీసుకురావాలి
- చైనా మాంజాను వినియోగించొద్దు
- పీసీసీఎఫ్ సువర్ణ



కోతుల పునరావాసకేంద్రంలో శ్రీకర్‌రాజును వివరాలు అడుగుతున్న పీసీసీఎఫ్ సువర్ణ



గండిరామన్న హరితవనాన్ని కాలినడకన సందర్శిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

సారంగాపూర్: ప్రజల సహకారంతో కోతుల పునరుత్పత్తి ప్రక్రియను త్వరలోనే నిరోధించగలుగుతామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) సువర్ణ అన్నారు. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) గ్రామ సమీపంలోని గండిరామన్న హరితవనాన్ని, సమీపంలోని కోతుల పునరావాస కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. కోతుల కుటుంబ నియంత్రణ ప్రక్రియకు సంబంధించిన వివరాలను డాక్టర్ శ్రీకర్ రాజును అడిగి తెలుసుకున్నారు. కోతులను కేంద్రానికి తీసుకువచ్చే విషయంపై చర్చించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కోతులను పట్టి కేంద్రానికి తీసుకువస్తే పునరుత్పత్తి ప్రక్రియను నిరోధించగలుగుతామన్నారు. పునరావాస కేంద్రానికి ప్రత్యేకంగా పర్మినెంట్ వైద్యులను నియమించే విషయం గురించి చర్చించారు. అనంతరం గండిరామన్న హరితవనంలో పర్యటించి అక్కడి పరిసరాలను జంగిల్ సఫారీలో పరిశీలించారు. అనంతరం కాలినడకన పలు ప్రాంతాలను పర్యవేక్షించారు. పార్కులో ప్రజల అవసరాలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కును అందంగా తీర్చిదిద్దాలని డీఎఫ్‌వో నాగినిభానును ఆదేశించారు.

చైనా మాంజా వాడొద్దు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా గాలిపటాలను ఎగురవేసేందుకు చైనా మాంజాను వినియోగించొద్దని పీసీసీఎఫ్ కోరారు. అటవీశాఖ అధికారులు చైనా మాంజా నివారణలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు పోస్టర్లు అంటించాలని తెలిపారు. చైనా మాంజాతో పక్షులకే కాకుండా మనుషుల ప్రాణాలు పోతున్నాయన్నారు. ఆమె వెంట బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్, ఫ్లయింగ్ స్క్వాడ్ డివిజనల్ అధికారి సీహెచ్ రవీందర్, ఎఫ్ఆర్వోలు రామకృష్ణ, వేణుగోపాల్, అనిత, అవినాష్, శ్రీనివాసరావు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

ఆహ్లాదకరంగా ఏర్పాట్లు చేయాలి

మామడ: అటవీ ప్రాంతానికి నేచర్ క్యాంపు, బర్డ్‌వాచ్ కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం అటవీ ప్రాంతంలో ఆహ్లాదకరమైన ఏర్పాట్లు ఉండాలని కంపా పీసీసీఎఫ్ సువర్ణ అన్నారు. మండలంలోని దిమ్మదుర్తి అటవీ ప్రాంతం పరిధిలోని తుర్కం, యెంగన్న చెరువులను సందర్శించారు. నేచర్‌క్యాంపు, బర్డ్‌వాచ్‌ను పరిశీలించారు. ప్రకృతి పర్యాటకులను ఆకట్టుకుంటుందని, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఖానాపూర్ మండలం రాజూరా గ్రామ సమీపంలో పులిదాడిలో మృతిచెందిన లేగదూడ యజమానికి రూ.8 వేల పరిహారం అందించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బోథ్: మండల కేంద్రానికి చెందిన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కాలేరి శేఖర్ (34) 2022లో నిజామాబాద్ జిల్లా నందిపేటకు చెందిన సోనితో వివాహమైంది. పెళ్లి జరిగిన నెల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఆరునెలల క్రితం పెద్దలు పంచాయితీ నిర్వహించారు. అనంతరం ఇరువురు అన్యోన్యంగా ఉన్నారు. మళ్లీ మూడురోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. సోని తన తల్లిండ్రులకు ఫోన్ చేసి గొడవ జరుగుతున్నట్లు తెలిపింది. కాగా, పెద్దమనిషిగా వ్యవహరించిన నిఖిల్‌కు సోని తల్లిదండ్రులు ఫోన్ చేసి తమ కూతురుని తమ వద్దకు పంపించాలని కోరారు. దీంతో శేఖర్ తండ్రి సంతోష్, నిఖిల్ సోనిని తల్లిదండ్రులకు అప్పగించి వచ్చారు. కాగా, తన భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో శేఖర్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరుగురి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఆరునెలల జైలు

వాంకిడి: మద్యం మత్తులో ఆటో నడుపుతూ ఆరుగురి మృతికి కారణమైన వ్యక్తికి ఆరునెలల జైలుశిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో మండలంలోని సరాండి గ్రామం వద్ద నిర్వహించిన భవానీ జాతరకు కెరమెరి మండలానికి చెందిన మొహర్లే రాంచందర్ తన ఆటోలో అదే మండలానికి చెందిన 10 మందిని తీసుకువచ్చాడు. జాతర ముగించుకుని తిరిగి కెరమెరికి వెళ్లే క్రమంలో రాంచందర్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ బెండార గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదానికి కారకుడయ్యాడు. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. అప్పటి ఎస్సై రాజు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. పీపీ ఎలిసా సాక్షులను కోర్టులో హాజరుపర్చగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ జక్కుల అనంతలక్ష్మి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో రాంచందర్‌కు ఆరునెలల జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఎస్సై ప్రశాంత్, కోర్టు సిబ్బంది పూల్‌సింగ్‌ను ఎస్సీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

వాంకిడి: మండలంలోని గోయేగాం గ్రామ శివారులో మంగళవారం ఎన్‌హెచ్-363పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇటన్‌కార్ సుభాష్ (32) మంగళవారం తన ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రకు వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే గోయేగాం గ్రామ సమీపంలో మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన సుభాష్‌ను హైవే సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.